మొండి బకాయిలపై నజర్

- డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ పర్యవేక్షణలో రుణ వాయిదాల వసూళ్లకు డ్రైవ్
- పేరుకుపోయిన రూ.12 కోట్లు
- సకాలంలో చెల్లించాలని యాచారం పీఏసీఎస్ అధికారుల సూచన


యాచారం పీఏసీఎస్ కార్యాలయం

యాచారం: మొండి బకాయిదారుల నుంచి అప్పులు రికవరీ కోసం పీఏసీఎస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పదేళ్ల కింద పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు పొంది తిరిగి చెల్లించని రైతులకు ఇప్పటికే డీసీసీబీ నుంచి వారి ఆస్తుల జప్తు కోసం నోటీసులు పంపించారు. పలుమార్లు తాఖీదులు పంపించి, వ్యక్తిగతంగా కలిసి ప్రాధేయ పడిన రైతుల్లో చలనం లేకపోవడంతో ఆస్తుల జప్తులో లీగల్‌గా ముందుకు వెళ్లడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. యాచారం పీఏసీఎస్‌లో పదేళ్లుగా 2,132 మంది రైతులు రూ.37 కోట్ల దీర్ఘకాలిక రుణాలు పొందారు. ఫౌల్ట్రీ, డెయిరీఫాం, పాడి పశువులు, గొర్రెల, మేకల పెంపకం కోసం రుణాలు తీసుకున్నారు. రుణ గ్రహీతలు దాదాపు 15 ఏళ్ల పాటు ఏటా మార్చి 30 లోపు వాయిదాలతో పాటు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ కొందరు రైతులు వాయిదాలను సక్రమంగా చెల్లించకపోవడంతో పాటు అధికారులు పంపించిన నోటీసులను పట్టించుకోవడం లేదు.

ఆస్తుల జప్తునకు నోటీసులు

యాచారం పీఏసీఎస్‌లో రూ.27 కోట్ల దీర్ఘకాలిక రుణాలు పొందిన 2,132 రైతుల్లో 1,100 మంది అప్పు వాయిదాలను సక్రమంగానే చెల్లిస్తున్నారు. కానీ మిగతా వారు చెల్లించకపోవడంతో పదేళ్లుగా దాదాపు రూ.12 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటి వసూళ్ల కోసం అధికారులు ఇప్పటికే ఆస్తుల జప్తు నోటీసులు జారీ చేసి లీగల్ చర్యలకు ఉపక్రమించారు. ఏటా సక్రమంగా అప్పు వాయిదాలు చెల్లించే 1,100 మంది రైతులకు కూడా పీఏసీఎస్ అధికారులు మార్చి 30 లోపు వాయిదా బకాయి మొత్తం చెల్లించాలని నోటీసులు పంపిస్తున్నారు. డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచందర్ రావు ఆధ్వర్యంలో యాచారం పీఏసీఎస్ అధికారులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తు నిత్యం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పైగానే వసూల్ చేస్తున్నారు. రూ.14 కోట్ల పంట రుణాలను 1,200 మంది రైతులు తీసుకున్నారు. ఏడాది లోపు రెన్యూవల్ చేసుకుంటే పంట రుణాలపై 7 శాతం వడ్డీ, అదే ఏడాది తర్వాత రెన్యూవల్ చేసుకుంటే 13 శాతం వడ్డీ పడుతుందని అధికారులు చెబుతున్నారు.


తమ్మలోనిగూడలో బకాయి వసూలు చేస్తున్న పీఏసీఎస్ అధికారులు

కోవిడ్‌లో నష్టపోయాం



కోవిడ్‌తో ఫౌల్ట్రీఫాంకు తీవ్ర నష్టం జరిగింది. గత రెండేళ్లు బాగానే ఉన్నప్పటికీ తీవ్ర చలితో కోడి పిల్లలు మృతి చెందాయి. 2017లో 4 ఎకరాల పొలాన్ని తాకట్టు పెట్టి పీఏసీఎస్‌లో రూ.27 లక్షలు అప్పు తీసుకున్నాను. ప్రస్తుతం రూ.6 లక్షలు బకాయి చెల్లించాలని నోటీసు వచ్చింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– బీరప్ప, రైతు, నక్కర్తమేడిపల్లి

స్పెషల్ డ్రైవ్ చేస్తున్నాం



రైతులు దీర్ఘకాలిక రుణాల వాయిదా అప్పులు చెల్లించకపోతే ఆ భారం మీకే పెరుగుతుంది. మార్చి 30 లోపు రూ.15 కోట్లకు పైగా వసూల్ చేయాలని లక్ష్యం ఉంది. నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రూ.20 లక్షల వరకు వసూల్ చేస్తున్నాం. రైతులు పదే పదే వారి ఇళ్ల వద్దకు వెళ్తేనే బకాయిలు చెల్లిస్తున్నారు.

– నాగరాజు, సీఈఓ, పీఏసీఎస్, యాచారం

రెన్యూవల్ చేసుకోవాలి



పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు ఏడాది లోపే రెన్యూవల్ చేసుకోవాలి. లేదంటే వడ్డీ పడుతుంది. అర్హులైన రైతులకు పంట రుణాలతో పాటు, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నాం. వ్యక్తిగత రుణాలు కూడా అందజేస్తున్నాం. రుణాలు వంద శాతం వసూలైతే మిగతా వారికి అప్పులు ఇచ్చే అవకాశం ఉంటుంది.

– రాజేందర్‌రెడ్డి, చైర్మన్, పీఏసీఎస్, యాచారం

బడ్జెట్‌లో రైతులకు పెద్దపీట


తుర్కయంజాల్: క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

- బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్
- ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

తుర్కయంజాల్: కేంద్ర ప్రభుత్వం రైతులకు బడ్జెట్‌లో పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయమని బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. మంగళవారం తుర్కయంజాల్‌లో ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి పూచికత్తు లేకుండా రూ.5 లక్షల వరకు కిసాన్ క్రెడిట్ కార్డులను ఇవ్వడం, రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమైందన్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు నర్సింహగౌడ్, రాంరెడ్డి, అర్జున్‌గౌడ్ తదితరలు పాల్గొన్నారు.

సామాన్యులకు ఊతం

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు ఎంతో మేలు చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి అన్నారు. ప్రజల బడ్జెట్ చూసి కాంగ్రెస్ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, విక్రంరెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనపట్ల దేశప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేశారన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు ఊతమిచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, లక్ష్మణ్, శేఖర్, శ్రీశైలం యాదవ్, రాములు, శ్రీశైలంగౌడ్, కృష్ణ, వెంకటయ్య, బుచ్చయ్య, జానయ్య పాల్గొన్నారు.


ఆమనగల్లులో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆక్టోపస్ రోడ్డులో శ్రమదానం

పార పట్టి మట్టి ఎత్తిన పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిత్యం లాఠీ పట్టి గస్తీ కాచే పోలీసులు పలుగు, పార, తట్టా పట్టి మట్టిని ఎత్తారు. గుంతలమయమైన రోడ్డుని పూడ్చారు. మండల పరిధిలోని నాగన్‌పల్లి శివారు నుంచి ఇబ్రహీంపట్నం వరకు రోడ్డు ధ్వంసమైంది. రహదారికి ఇరువైపులా గోతులు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గమనించిన ఆక్టోపస్ పోలీసులు మంగళవారం స్పందించారు. థర్డ్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌పాషా, అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్‌లతో పాటు పోలీసులు కలిసి పార తట్టా పట్టుకొని మట్టిని ఎత్తారు. రోడ్లకు ఇరువైపుల గోతుల్లో మట్టి పోశారు. ఇబ్రహీంపట్నం నుంచి ఆక్టోపస్ వరకు శ్రమదానం చేసిన పోలీసులకు స్థానికులు కితాబిస్తున్నారు.


పనిలో ఆక్టోపస్ థర్డ్ బెటాలియన్ అధికారులు

రోడ్డుకి నిధుల మంజూరు

ఎస్ఎస్‌జీ నుంచి ఇబ్రహీంపట్నం వరకు అధ్వాన దారులు అనే శీర్షికతో ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం, అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి రూ.56 లక్షలు కేటాయించారు. టెండర్లు ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం.

చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు


ఆలయంలో భక్తుల పూజలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకపూజలు, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లయ్య, నర్సింహ, చంద్రయ్య, కృష్ణయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశం

మంచాల: మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, బహదూర్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సైతం రానున్నట్లు వివరించారు. గ్రామాల్లో ప్రతి బూత్ కమిటీ నుంచి 20 మందికిపైగా కార్యకర్తలు రావాలని సూచించారు. సమావేశాన్ని మండల కేంద్రంలోని దండేటికార్ శర్వంచ్ పంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎస్ఐకి సన్మానం



ఆమనగల్లు: స్థానిక పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ యాదయ్యను నాయకులు సత్కరించారు. ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆయన ఇటీవల ఎస్ఐగా పదోన్నతి పొందారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ యాదయ్యను స్థానిక నాయకులు వడ్డె రాజు, అశోక్, గిరియాదవ్, మహేశ్, అమర్, గోపి కలిసి శాలువాతో సన్మానించారు.

అక్రమ నిర్మాణం తొలగింపునకు ఫిర్యాదు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల మైదానంలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని జవహర్ యువజన సంఘం అధ్యక్షుడు సాతెల్లి నాగరాజు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల రెవెన్యూ అధికారి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. జవహర్ యూత్ క్లబ్ మైదానంలో అక్రమంగా నిర్మించిన గదిని తొలగించాలంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరిలో సంఘం సభ్యులు ముఖేశ్‌గౌడ్, నర్సింహ, ఆరుట్ల సురేష్ సురేష్ ఉన్నారు.


ఫిర్యాదు చేసేందుకు వచ్చిన జవహర్ యువజన సంఘం ప్రతినిధులు

ఘనంగా కల్యాణోత్సవం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆంజనేయశర్మ, వేంకటేశ్వరశర్మ, శ్యాంసుందర్‌శర్మ, రాంశంకర్‌శర్మల నేతృత్వంలో ఏమిరెడ్డి ప్రియాంక, పాండురంగారెడ్డి దంపతులు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మక్త మాదారంలో..

కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ ధర్మకర్త ఇంజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో రుక్మిణి, సత్యభామా శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.


చుక్కాపూర్‌లో కల్యాణోత్సవంలో నిర్వాహకులు

తాగునీటి సమస్య రానివ్వం

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ


సాహెబ్‌గూడలో పర్యటిస్తున్న కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: తాగునీటి సమస్య రానివ్వమని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.బాలకృష్ణ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని సాహెబ్‌గూడలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, భూగర్భ డ్రేనేజీలు, పాడైన మ్యాన్‌హోల్స్‌తో పాటు తాగునీటి సమస్యలను పరిశీలించారు. పట్టణ ప్రజలకు నీటి సమస్య విపరీతంగా ఉందని వేసవి రాకముందే సమస్యలు లేకుండా చూడాలని కమిషనర్‌కు విన్నవించారు. పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎంఏ జహంగీర్‌ఖాన్ కోరారు. స్పందించిన కమిషనర్ బాలకృష్ణ.. తప్పకుండా ప్రజలందరూ చెప్పిన విషయాలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. తక్షణమే విద్యుత్, తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. మిగతావి దశల వారీగా ప్రాధాన్యత క్రమంగా పనులు చేయిస్తామన్నారు. అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు అందించడానికి అధికారులు కృషి చేస్తారన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించమన్నారు. కార్యక్రమంలో యూత్ యువసేనా కమిటీ అధ్యక్షుడు రాముగౌడ్, నాయకులు నవీన్, నర్సింహగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పట్టణప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశం

యాచారం: ఓటర్ల జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ నరేందర్ రెడ్డి అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ప్రకటించిన ఓటర్ల జాబితాపై చర్చించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన కోసం మాట్లాడారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఓటరు జాబితాను సవరించామని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటర్లు నమోదు సమయంలో జాబితాలో తప్పులు దొర్లాయన్నారు. సవరించి గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, పంచాయతీల కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మంచాల: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలశంకర్

వ్యసనాల బారిన పడొద్దు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

యాచారం: విద్యార్థులు వ్యసనాల బారిన పడొద్దని, గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో విలువైందని, చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో చెడు మార్గాలకు లోనైతే జీవితమే దారి తప్పుతుందన్నారు. బాగా కష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా చదువుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో ఎస్ఐ తేజం రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

ఆమనగల్లు: అర్హులైన వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లితాండాలో మంగళవారం బీజేపీకి చెందిన బాలకోటి, గోపి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా కేశవులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు రాగ్యానాయక్, శ్రీనునాయక్, కృష్ణనాయక్, మల్లేశ్‌నాయక్, హర్యానాయక్, రవి, గోపాల్, రమేశ్, లక్ష్మణ్, శంకర్, చంద్రు, గోపి తదితరులు పాల్గొన్నారు.


కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కేశవులు

బ్రహ్మోత్సవాలకు వేళాయె

8 నుంచి చెన్నకేశవస్వామి ఆలయంలో ఉత్సవాలు

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఉత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అర్చకులు మెల్లురు వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 8న ధ్వజారోహనం, అంకురార్పణ, విశ్వక్‌సేనపూజ, 9న ప్రత్యేకపూజలు, లలితా సహస్రనామ పారాయణం, స్వామివారి ఎదుర్కోలు, 10న స్వామివారి కల్యాణోత్సవం, పూజలు, 11న లక్ష పుష్పార్చన, ప్రత్యేకపూజలు తదితర పూజలు చేస్తారు. 14న కుంకుమార్చన, ప్రత్యేకపూజలు, చక్రతీర్థం, గరుడ సేవ ఊరేగింపు, నాగవల్లితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల కోసం ఆలయ కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.


ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

క్లుప్తంగా

బాల్య స్నేహితురాలికి ఆపన్నహస్తం


ఆర్థికసాయం ఇస్తున్న చిన్ననాటి స్నేహితులు

యాచారం: ఆపద కాలంలో అండగా నిలిచే వారినే నిజమైన మిత్రులంటారు. మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన విజయ ఇటీవల అనారోగ్యంతో తన భర్త శ్రీనివాస్‌ను కోల్పోయింది. ఈ విషయం గమనించిన ఆమె పదో తరగతి బాల్యమిత్రులు(2000–01 బ్యాచ్) చేయి చేయి కలిపి ఆపన్నహస్తం అందించారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి వెళ్లి విజయకు రూ.34 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.31,500 మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో చెక్కు అందించారు. నాయకులు నిరంజన్, సురమల్ల సుభాష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌నాయక్‌ను బీజేపీ నాయకులు సత్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శంకర్‌నాయక్‌ను మాజీ కౌన్సిలర్ కృష్ణనాయక్, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌సింగ్, శ్రీశైలంయాదవ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

కాలనీ కమిటీ ఎన్నిక


ఇందిరమ్మ కాలనీలో సమావేశమైన స్థానికులు

యాచారం: మండల పరిధిలోని మాల్ గ్రామం ఇందిరమ్మ కాలనీలో మంగళవారం కాలనీ ప్రజలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాలనీలో తాగునీటి సమస్య, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, సీసీ రోడ్లపై చర్చించారు. కాలనీ ప్రజలు ఐక్యంగా అభివృద్ధి పనులు చేసుకుందామని తీర్మానం చేసుకున్నారు. అనంతరం కాలనీకి కమిటీని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా కానమోని నర్సింహ, ఉపాధ్యక్షుడిగా దూసరి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా కారింగ శంకర్, కోశాధికారిగా శేఖర్, కార్యదర్శిగా మహేశ్‌లను ఎన్నుకున్నారు.

వైభవంగా రథోత్సవం


శెట్టిపల్లిలో రథాన్ని లాగుతున్న భక్తులు

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు మంగళవారం స్వామివారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పూజారులు కృష్ణమాచార్యులు, రాధాకృష్ణశర్మ, అనిల్‌జోషి, నిహాల్‌జోషిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథం వద్ద మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, మాధవిలు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు రథాన్ని లాగారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేకపూజలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్, మాజి సర్పంచ్ లలితజ్యోతయ్య, నాయకులు నర్సింహ, యాదగిరి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.